ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 26 నవంబరు 2025

గరిష్ఠం : 28.5
కనిష్ఠం : 18.2





వందేభారత్‌కు అదనపు బోగీలు

● తిరుపతికి వెళ్లే రైలుకు నాలుగు బోగీలు అదనం

వివరాలు 7వ పేజీలో

చికెన్ ధరలు | లైవ్ : రూ.150 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250


కాంగ్రెస్‌లో దుమారం!

● నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా కైలాష్‌ని తొలగించాలంటోన్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్ష పదవి దుమారం రేపుతోంది. డీసీసీ అధ్యక్ష పదవి నుంచి పున్నా కైలాష్‌ని తొలగించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీఎం, పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ నేతలకు ఫిర్యాదు చేయడం పార్టీ శ్రేణుల్లో విస్మయం కలిగించింది. తన రాజకీయజీవితంలో కక్షసాధింపు వ్యవహారాల్లేవని, అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలిచానని, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యజించిన తనపైనా, తన కుటుంబసభ్యులపైనా, తల్లిదండ్రుల పైనా అకారణంగా కైలాస్ దుర్భాషలాడారని, ఆ వీడియోలను ఇప్పుడు అసందర్భంగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడం తనని, తన కుటుంబీకులను తీవ్ర మనస్థానానికి లోనుచేసిందని మంత్రి సీఎం సహా తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. ఈ వీడియోలు తాజాగా సోషల్‌మీడియాలో వైరల్ అయిన అంశంపై తాను పోలీసులకు ఫిర్యాదు కూడా ఇస్తానని, అధిష్ఠానం, సీఎం కైలాస్‌ని తక్షణం ఈ బాధ్యతల నుంచి తప్పించి, మరోనేతకు బాధ్యతలివ్వాలని మంత్రి వెంకటరెడ్డి స్వయంగా ఫిర్యాదులో పేర్కొనడంతో డీసీసీ అధ్యక్ష పదవిలో కైలాస్‌ని కొనసాగించే అంశంలో అధిష్ఠానం పునరాలోచన చేస్తుందని కాంగ్రెస్‌శ్రేణుల్లో చర్చసాగుతోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే పెద్దజిల్లా కాంగ్రెస్ కంచుకోట లాంటి ఈ ప్రాంతంలో డీసీసీ అధ్యక్షుడిపై ఏకంగా కీలకమైన మంత్రే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పార్టీని ముందుకునడపడం కష్టమనే భావన వ్యక్తమవుతోంది. డీసీసీ అధ్యక్షుడిగా కైలాస్ నియామకమైన మూడు రోజుల్లోనే సీన్‌మారిపోవడంతో పార్టీలోనూ ఉత్కంఠ మొదలైంది.



పంచాయతీ పోరుకు మోగిన నగారా



● మూడు దఫాల్లో పల్లె ఎన్నికలు ● డిసెంబరు 11, 14, 17 తేదీల్లో నిర్వహణ ● 27న నోటిఫికేషన్ విడుదల ● 486 పంచాయతీలు, 4,388 వార్డులకు ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. సర్పంచ్, వార్డు స్థానాలకు ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు చేయగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబరు 11, 14, 17 తేదీల్లో ఎన్నికల నిర్వహించనున్నారు. మొదటి విడత ఎన్నికలకు ఈ నెల 27వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదట ఎనిమిది మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా షెడ్యూల్ ప్రకటనతో మంగళవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం ఓటర్లు 6,94,815 ఉండగా అందులో 3,40,743 పురుషులు, 3,54,050 మంది మహిళలు, 22 ఇతరులు ఉన్నారు. మూడు విడతల్లో జరిగే ఎన్నికల్లో మొదటి, రెండు విడతల్లో ఎనిమిది మండలాల చొప్పున, మూడో విడత ఏడు మండలాల్లో ఎన్నికల నిర్వహిస్తారు. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు వెల్లడించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు.

486 గ్రామాల్లోని 4,388 వార్డుల్లో

జిల్లాలో మూడు విడతల్లో జరిగే ఎన్నికలు 486 గ్రామ పంచాయితీల్లో జరుగనున్నాయి. ఆయా గ్రామాల్లోని సర్పంచ్ పదవులతో పాటు 4,388 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఆత్మకూరు(ఎస్), అర్వపల్లి, మద్దిరాల, నాగారం, నూతనకల్, సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లోని 159 గ్రామాల్లో 1,442వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.అదేవిధంగా అనంతగిరి, చిలుకూరు, చివ్వెంల, కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్ మండలాల్లోని 181 గ్రామాల్లో 1,628 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. మూడో విడతలో గరిడేపల్లి, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 146 గ్రామాల్లో 1,318 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న అధికారులు

జిల్లాలోని 23 మండలాల్లోని 486 గ్రామపంచాయతీలతో పాటు 4,388 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని

(మిగతా 8వ పేజీలో)

సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు

ఎస్టీలకు	111
ఎస్సీలకు	91
జనరల్‌కు	218
మొత్తం	486
మహిళలకు	213
జనరల్‌కు	273



ఎన్నికల ప్రక్రియ ఇలా..	మొదటివిడత	రెండోవిడత	మూడోవిడత
ఎన్నికల నోటిఫికేషన్	27.11.2025	30.11.2025	03.12.2025
జాబితాల ప్రదర్శన	27.11.2025	30.11.2025	03.12.2025
నామినేషన్ల స్వీకరణ	27.11.2025	30.11.2025	03.12.2025
నామినేషన్లకు గడువు	29.11.2025	02.12.2025	05.12.2025
నామినేషన్ల పరిశీలన	30.11.2025	03.12.2025	06.12.2025
చెల్లిన నామినేషన్ల ప్రకటన	30.11.2025	03.12.2025	06.12.2025
అభ్యంతరాల స్వీకరణ	01.12.2025	04.12.2025	07.12.2025
అభ్యంతరాల పరిష్కారం	02.12.2025	05.12..2025	08.12.2025
నామినేషన్ల ఉపసంహరణ	03.12.2025	06.12..2025	09.12.2025
అభ్యర్థుల ప్రకటన	03.12.2025	06.12.2025	09.12.2025
పోలింగ్ తేదీ	11.12.2025 (ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు)	14.12.2025	17.12.2025
ఓట్ల లెక్కింపు	11.12.2025 (మధ్యాహ్నం 2గంటల నుంచి)	14.12.2025	17.12.2025
ఉపసర్పంచ్ ఎన్నిక	విజేతలను ప్రకటించిన వెంటనే		

(ఏదైనా కారణంతో నిర్వహించలేకపోతే, మరునాడు నిర్వహిస్తారు)

అపార్‌పై సాగదీత?

● నమోదుపై దృష్టి సారించని విద్యాసంస్థలు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పొందుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం ఆటోమెటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)ని తీసుకువచ్చింది. జిల్లాలో అపార్ అంతగా ముందుకు సాగడంలేదు. ముఖ్యంగా ఈ-గుర్తింపు కార్డు కోసం విద్యార్థుల వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. అపార్ ప్రారంభమై ఏడాది గడుస్తున్నా పూర్తికాలేదు. జిల్లాలో 65శాతం విద్యార్థుల వివరాలు మాత్రమే నమోదు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలు మొత్తం 1,319 ఉన్నాయి. వీటిలో విద్యార్థులు 1,47,603 మంది విద్యనభ్యసిస్తున్నారు. అదేవిధంగా అపార్‌లో 92,305మంది నమోదు చేసుకున్నారు. కాగా 55,298 మంది ఇంకా చేసుకోవాల్సి ఉంది. అదేవిధంగా జిల్లాలోని అన్నిపాఠశాల విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ 5-15ఏళ్ల వారికి అప్డేట్ చేయాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ మండలానికి ఒక ఆపరేటర్‌ను ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ ద్వారా రాష్ట్ర కార్యాలయం నుంచి నియమించారు. వారికి కేటాయించిన మండలాలోని అన్ని పాఠశాలలో విద్యార్థుల ఆధార్ సవరణను తప్పనిసరి వేలిముద్రల అప్డేట్ చేయాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా 24.532 విద్యార్థులకు అప్డేట్ చేయాల్సి ఉండగా ప్రతి ఒక్కరూ 10 ఏళ్లకు ఒకసారి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకుంటే ఆ తర్వాత అపార్ ప్రక్రియకు సులభమవుతుంది. ఆధార్ వివరాలు

(మిగతా 8వ పేజీలో)

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థి ఇందిరను అభినందిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. అగర్తలా పట్టణంలో త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన సూర్యాపేటకు చెందిన రాడికల్ చెస్ అకాడమీ విద్యార్థి ఇందిరను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన అభినందించారు. పిల్లల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారు అందులో రాణించేందుకు సహకరించాలన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని ఇందిరకు సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రాడికల్ చెస్ అకాడమీ కోచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంచుకోవాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న చక్రహరి నాగరాజు

సూర్యాపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చక్రహరి నాగరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్-18 రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యమన్నారు. క్రీడాకారులు జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, సందీప్, ఎల్గూరి రామూర్తి, రవి, ప్రవీణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వీరస్వామి, కళ్యాణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ఏపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ చైతన్య

ఆత్మకూరు(ఎస్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. బాల్య వివాహాలతో అనర్థాలను మంగళవారం మండలంలోని ముక్తా కొత్తగూడెం, మాచినపల్లి, ఏపూర్ గ్రామాల్లో ప్రజలకు వివరించారు. చిన్నవయస్సులోనే పెళ్లి చేయడం వల్ల చిన్నతనాన్ని, చదువును కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య విహహాలతో మానసికంగా ఎదుగుదల సరిగా లేకపోవడంతో వారికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు జరిపితే టోల్ ఫ్రీ నెంబరు 1098 లేదా డయల్-100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, శ్రీలక్ష్మి, వంశీ, వినోద్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు అందజేస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి

సూర్యాపేటటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన రూ.1.51కోట్ల చెక్కును మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓపం క్షన్‌హాల్‌లో అందించి, మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళల పొదుపు సొమ్మును సైతం కాజేసిందన్నారు. అనంతరం ఇందిరా శక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఆర్డీవో వేణుమాధవ్, తహసీల్దార్ కృష్ణయ్య, ఏపీడీ సురేష్, ఎంపీడీవో బాలకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజేష్ కేసులో పోలీసులపై కేసు నమోదు చేయాలి



రాజేష్‌చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కోదాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దళిత యువకుడు రాజేష్ మృతికి కారణమైన పోలీసులపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదోడికి ఒక న్యాయం, ఉన్నోడికి ఒక న్యాయం జరుగుతోందన్నారు. వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్న మంత్రులపై, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు కేసులు నమోదు చేయటం లేదన్నారు. రాష్ట్రంలో దళితులకు సరైన న్యాయం జరగటం లేదని ఆరోపించారు. దళితులపై రోజురోజుకూ పోలీసుల దాడులు పెరుగుతున్నాయన్నారు. రాజేష్ మృతదేహానికి రీపోస్టుమార్టం చేసి పోలీసులకు శిక్ష పడేలా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజేష్ కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం, ప్రభుత్వ ఉద్యోగం, వసతి గృహాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వ పెద్దలు ఎందుకు పరామర్శించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో షేక్ నయీం, కర్ల సుందర్‌బాబు, దొంగరి శ్రీనివాస్, క్రాంతి, లలిత, ఉపేందర్, నర్సయ్య, సీమ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేస్తున్నారని బీసీ సాధన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధనుంజయనాయుడు ఆరోపించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ మోకాళ్లపై కూర్చుని నల్లకండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్, పిల్లుట్ల కనకయ్య, చిలకరాజు శ్రీనివాస్, వెంకట్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, కొండానాయక్, కృష్ణ పాల్గొన్నారు.

జాతి ఏకీకృతంలో పటేల్ కీలక పాత్ర



యూనిటీ మార్చ్ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్ధార్ వల్లబాయ్ పటేల్ పాత్ర మరువలేనిదని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో జరిగే యూనిట్ మార్చ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ప్రజలలో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యూనిటీ మార్చ్‌ను కోదాడ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఎంఈవో సలీంషరీఫ్ మాట్లాడుతూ పటేల్ స్ఫూర్తితో జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ, మైభారత్ స్టాఫ్ నాయక్, మధు, సంపత్, సైదావలి, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

నెమ్మికల్‌లో ప్రసాదాల విక్రయ హక్కులకు డిమాండ్

● గతంకంటే రూ.2 లక్షల చొప్పున పెరుగుదల



దేవాదాయ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ వద్ద వివిధ వస్తువుల విక్రయ హక్కులకు మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, పూజసామాగ్రి విక్రయ హక్కులను గతం కంటే రూ.2 లక్షలకు అదనంగా పాడి దక్కించుకున్నారు. కొబ్బరికాయల విక్రయానికి గతేడాది రూ.7 లక్షలుగా ఉండగా ఈ పర్యాయం రూ.9.10 లక్షలకు తిరుమలగిరికి చెందిన ఒంగర సోమయ్య దక్కించుకున్నారు. లడ్డూ, పులిహోర విక్రయాలకు గతేడాది రూ.6 లక్షలు ఉండగా ఈ పర్యాయం రూ.8.20 లక్షలకు నెమ్మికల్‌కు చెందిన దాసరి సైదులు దక్కించుకున్నారు. పూజ సామాగ్రికి సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. జనవరి 1 నుంచి డిసెంబరు 31 వరకు ఏడాది పాటు విక్రయ హక్కులు ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఆలయ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి, ఈవో జయ రామయ్య, పచ్చిపాల వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాన్ని తెరవడంలోనూ ఆలస్యం

దండు మైసమ్మ ఆలయంలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని నెమ్మికల్ గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం ఆలయం వద్ద నిర్వహించిన వేలం పాట సమయంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఉదయం ఆరు గంటల ఆలయం శుద్ధి చేసి అభిషేకాలు చేయాల్సి ఉండగా, ఏడు గంటల వరక కూడా సిబ్బంది, ఆలయ అర్చకులు రావడం లేదన్నారు. ఆలయ సమీపంలో వీధి దీపాలు, సీసీ కెమెరాలు లేవన్నారు. మరుగుదొడ్ల లేక భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలపై ఏమాత్రం దృష్టి సారించడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు ఆలయ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సుమతి, చైర్మన్ కరుణాకర్‌రెడ్డిలకు ఫిర్యాదు చేశారు.

అయ్యప్ప మాలధారుడి ఆత్మహత్య

● కారు కిస్తీ చెల్లించాలని ఫైనాన్సర్ బెదిరింపులు

● భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం

● హుజూర్‌నగర్‌లో విషాదం

లాక్రోస్‌లో రాష్ట్ర జట్టుకు పరమేష్ ఎంపిక

వివరాలు 7లో

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పశ్య పద్మ

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాయలంలో మంగళవారం నిర్వహించిన సంయుక్త కిసాన్‌మోర్చా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక వ్యవసాయ చట్టాలను మార్చేందుకు కుట్ర చేసిందన్నారు. 2021లో నల్లచట్టాలను రద్దు చేస్తామని మోదీ హామీ ఇచ్చి తిరిగి అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో మాదిరిగా 8 గంటలే కార్మికులు పనిచేసేలా అమలు చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాసు, నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, పల్లె వెంకటరెడ్డి, పోటు లక్ష్మయ్య, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేటలో వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి పూజలు



షష్టి పూజల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని త్రిశక్తి ఆంజనేయస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సుబ్రహ్మణ్య షష్టిపూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రేంటాల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో సర్వసూక్త హోమం, ఆశ్లేష బలిపూజ నిర్వహించారు. అంతకుముందు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమాలు, వత్రాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అనంతుల గణేష్, ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

46 జీవోను వెంటనే రద్దు చేయాలి

• బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రాందేవ్

నార్కట్‌పల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు నష్టం చేకూర్చే జీవో 46ను వెంటనే రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం బీసీ సంఘాలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందేవ్ మాట్లాడుతూ పార్టీల పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కాకుండా చట్టపరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్యా, ఉద్యోగాల్లోనే కాకుండా స్థానిక ఎన్నికల్లోనూ న్యాయం జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బంద్‌కు మద్దతిచ్చిన తరహాలనే అన్ని బీసీ సంఘాలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోర్టులు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు

ఇవ్వకుండా ఉండాలంటే రాజ్యాంగాన్ని సవరించడమొక్కటే మార్గమన్నారు. బీసీలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పులు వచ్చిన కొన్ని రాష్ట్రాల్లో బీసీలు ఉద్యమాలు చేయలేదు కాని తెలంగాణాలో మాత్రం బీసీలు ఐక్యతగా ఉండి బీసీ బంద్‌ను విజయవంతం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓరుగంటి వంశీ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్, నాయకులు ఎడ్ల మహలింగం, కర్నాటి యాదగిరి, నరేందర్‌రెడ్డి, దాసరి కృష్ణ, ఉపేందర్, మణికంఠ, భాస్కర్, ఉషశ్రీ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ధూంధాం నుంచి సినీ ప్రయాణం

• ఉద్యమ, మానవతా విలువలే కోదారి శ్రీనివాస్ పాటలు • మూడు సినిమాల్లో సహ నటుడిగా, లిరిక్ రైటర్‌గా గుర్తింపు • అనేక షార్ట్ ఫిల్మ్‌లకు కథలు



తెలంగాణ పోరాట ఉద్యమ నేపథ్యం ఆయనను ధూంధాం వైపు మళ్లించింది. బతుకు, ఆత్మగౌరవం కోసం తిరుగుబాటు, సామాజిక నేపథ్యం, మానవతా విలువలు నేర్పే పాటలు రాయడం అభిరుచి కావడంతో ఆయన ప్రయాణం సినిమాల వైపు మళ్లింది. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో పేద రైతు కుటుంబానికి చెందిన కోదారి శ్రీనివాస్(శ్రీను). సినీ కళాకారుడిగా, పాటల రచయితగా రాణిస్తున్నారు.

• ఆంధ్రజ్యోతి, మోత్కూరు



పోరు తెలంగాణ సినిమాలో ఓ సన్నివేశంలో హీరో నారాయణమూర్తితో శ్రీను(ఫైల్)

పదో తరగతి వరకు గుండాల జడ్పీహెచ్ఎ‌స్‌లో, ఇంటర్ ప్రథమ సంవత్సరం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలో చదివిన ఆయన హైదరాబాద్ వెళ్లి అక్కడ ఇంటర్ పూర్తిచేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివారు. చదువుకునే రోజుల నుంచే పాటలు రాసేవారు. తొలత అరుణోదయ సాంస్కృతిక సంస్థలో చేరిన శ్రీను పాటలు రాసి, పాడేవారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎన్నో పాటలు రాసి, ధూంధాం వేదికల్లో పాడారు. 'అసోయిధూల హారతి, కాళ్లగజ్జెల గమ్మతి', 'బొంబాయి పోతున్న అమ్మమాయమ్మ.. ఉండు పైలంగా అమ్మమాయమ్మ', 'ముద్దుల రాజాలు ఉత్తర మేస్తున్న కొడుకా', జనంగూడి జాతరెళ్లిపోదాం.. తెలంగాణ ఉద్యమాల ఉరుసు కెళ్లిపోదాం', 'చూడుచూడు నల్లగొండ.. గుండెనిండ ఫ్లోరైడు బండ' 'స్వేచ్ఛా స్వాతంత్ర్యంకై రణరంగ సమరంలో' లాంటి ఎన్నో పాటలు ప్రజాదరణ పొందాయి. ఉద్యమంలో సుమారు 360పాటలు, తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా పని చేసినప్పుడు 227 బతుకమ్మ పాటలు, సాంప్రదాయ గేయాలు రాసి రికార్డు చేసినట్లు చెప్పారు.

లిరిక్ రైటర్‌గా..

కోదారి శ్రీనివాస్ 'వీర తెలంగాణ', 'పోరు తెలంగాణ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోపాల్‌పేట' సినిమాల్లో సహ నటుడిగా నటించారు. పోరు తెలంగాణకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ మూడింటితో పాటు 'సూరిగాడు సూపర్ గుడ్' సినిమాలకు లిరిక్ రైటర్‌గా పని చేశారు.



అసిస్టెంట్ డైరెక్టర్‌గా..

షార్ట్ ఫిల్మ్స్

ప్రేమ కథనాలు, ద్వందార్థాల కథనాలతో కాకుండా సమాజానికి మానవతా విలువలు నేర్పేలా ఆయన విలువైన జీవితం, చదువే మలుపు, గంజాయి పంజా, 32 ఆఫ్ ఓవర్, మమతలు మాయమయ్యేనా.. అనే ఎనిమిది షార్ట్ ఫిలింలు తీశారు. ఇంక ఎక్కువగా షార్ట్ ఫిలింలు తీసేందుకు ఆర్థిక వనరులు లేనందున సుమారు 32 సార్ట్ ఫిల్మ్‌లకు మూల కథ అందించినట్టు ఆయన తెలిపారు.

ప్రముఖుల పుస్తకాల్లో శ్రీను ప్రస్తావన

తెలంగాణ ఆధునిక సాహిత్యం మూలాలు అన్న పుస్తకంలో ఆయన బయోగ్రఫీ, ఏస్ (ఏసీఈ) యూనివర్సిటీ ముద్రించిన సొసైటీ కల్చర్, హెరిటేజ్ ఆర్ట్ అండ్ లిట్రసీ ఆఫ్ టీఎస్ అన్న ఇంగ్లీష్ పుస్తకంలో శ్రీను గురించి రాశారు. ప్రముఖ కవి అందెశ్రీ రాసి ముద్రించిన నిప్పుల వాగు పుస్తకంలో కోదారి శ్రీనువి 14పాటలు అచ్చయ్యాయి. అంబటి వెంకన్న అలుగెల్లిన పాటలు, గద్దర్ పాటల దార, కవి సాహితీ వేత్త జూలూరి గౌరీశంకర్ ప్రచురించిన మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్ర, పర్యావరణ పరిశీలకుడు వేదకుమార్ ప్రచురించిన ఒక్కేసి పువ్వేసి పుస్తకంలో శ్రీనువి అనేక ఉద్యమ పాటలు ముద్రించారు.

అందుకున్న అవార్డులు

విక్రం ఆర్ట్ క్రియేషన్స్ ద్వారా 2012లో జానపద కళారత్న, 2014లో తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్(తానా) ద్వారా ఉద్యమ గొంతుక, 2017లో అప్పటి సీఎం కేసీఆర్ నుంచి తెలంగాణ ఉద్యమ రచయిత, ప్రపంచ తెలుగు మహాసభల్లో పురస్కారం, 2018లో జనగామ కల్చరల్ ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమ కవి గాయకుడు, 2025లో సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ గద్దరన్న ఐకాన్ అవార్డు అందజేసింది.

నాలుగేళ్లలో ఐదు పెళ్లిళ్లు

• నిత్య పెళ్లికుమారుడి అరెస్టు • ఐదుగురిని మోసగించిన కడప వాసి



సోమవరపు సురేంద్ర

భువనగిరి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లలో ఐదుగురిని వివాహమాడి మోసం చేసిన నిత్య పెళ్లి కుమారుడిని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. భువనగిరి పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపకు చెందిన సోమవరపు సురేంద్ర 2021లో క్రిస్టియన్ మ్యాట్రిమోని ద్వారా భువనగిరికి చెందిన ఓ యువతికి పరిచయమయ్యాడు. మైనింగ్ వ్యాపారం చేస్తున్నానని, కన్సల్టెన్సీ నడుపుతున్నానని, తనకు పెట్రోల్ బంక్ ఉందని నమ్మబలికి రూ.15లక్షల నగదు, 30తులాల బంగారం తీసుకుని వివాహం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో కాపురం పెట్టిన సురేంద్ర తరచూ డబ్బులు, ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు. కడపకు తీసుకువెళ్లకపోవడం, భర్త ప్రవర్తనపై విసుగు చెందిన ఆమె 2023 సెప్టెంబరు 14న ప్రశ్నించటంతో మీతో నాకు ఎలాంటి సంబంధం లేదని మెసేజ్ పెట్టి ఆమె నెంబర్‌ను బ్లాక్ చేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె భువనగిరిలోని పుట్టింటికి చేరుకుంది. సురేంద్ర అప్పటికే కృష్ణవేణి అనే యువతిని వివాహం చేసుకుని రూ.12లక్షలు కట్నంగా తీసుకుని మోసం చేసి రూ.7లక్షలకు రాజీ చేసుకున్నాడు. భర్త కోసం కృష్ణవేణి భువనగిరిలోని యువతికి ఇంటికి రావడంతో ఆమె తల్లిదండ్రులు రూ.6లక్షలు చెల్లించారు. ఈ ఘటనపై గత ఏడాది ఆగస్టు 6వ తేదీన భువనగిరి యువతి ఫిర్యాదు చేయటంతో పోలీసులు ప్రత్యేక బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. సురేంద్ర ఐదుగురిని వివాహం చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మధ్యవర్తి జూపల్లి కిరణ్‌కుమార్ ద్వారా మరో మహిళ శైలజను వివాహం చేసుకుని రూ.2.50లక్షలు తీసుకున్నాడని, విజయవాడకు చెందిన రత్నకుమారిని వివాహం చేసుకుని రూ.2లక్షలు తీసుకున్నాడని, 2017లో కరీంనగర్‌కు చెందిన మరో యువతిని వివాహం చేసుకుని 2020లో ఆమెకు విడాకులు ఇచ్చినట్లు విచారణలో గుర్తించారు. మంగళవారం భువనగిరికి వచ్చిన సురేంద్రను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపెట్టినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత

నల్లగొండ రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినిలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థినులు, మహిళలపై హత్యాచారాలు, లైంగిక వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా విద్యార్థులపై జరిగే లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సంఘం పోరాడుతోందన్నారు. విద్యార్థులు అధ్యయనం, పోరాటంతో ముందుకు సాగాలన్నారు. నిర్భయ చట్టాలు వచ్చినా, అధికార పార్టీ నాయకులకు చుట్టాలుగా మారాయి తప్ప మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని జూనియర్ కళాశాలు, గురుకుల పాఠశాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కుంచం కావ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, నాయకులు కుర్ర సైదానాయక్, అంజలి, మమత, సావిత్రి, రేణుకా, మనిషా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధదంపతుల ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ

• ఆస్తులు తీసుకొని తమను పట్టించుకోవడం లేదని 'ప్రజావాణి'లో ఫిర్యాదు • విచారణ నిర్వహించిన ఆర్డీవో

ఆలేరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆస్తులు తీసుకొని, తమ యోగక్షేమాలు పట్టించుకోవడం లేదని యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ వృద్ధ దంపతులు ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 'మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు మీరే దిక్కు సారూ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు భువనగిరి ఆర్డీవో, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కృష్ణారెడ్డి స్పందించారు. ఆలేరు తహసీల్దార్ ఆంజనేయులుతో కలిసి మంగళవారం మండలంలోని కొలనుపాక గ్రామంలో ఉంటున్న ధర్మ సోమిరెడ్డి రమణమ్మ దంపతులను కలుసుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మా ట్లాడుతూ సోమిరెడ్డి రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు ధర్మా నర్సింహారెడ్డి, ఆలేరు మండలం గుండ్లగూడెంలోని సీఎస్ఐ పాఠశాలలో ఏవో టీచర్‌గా విధులు నిర్వహిస్తూ రెండేళ్ల క్రితం రిటైర్డ్ కాగా, చిన్న కుమారుడు ధర్మ గోవర్ధన్‌రెడ్డి వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగి స్తున్నాడని తెలిపారు. వీరికి 14ఎకరాలు ఉండగా ఇద్దరు కుమారులకు సోమి రెడ్డి రమణమ్మ దంపతులు ఆరు ఎకరాల చొప్పున ఇద్దరికీ రిజిస్ట్రర్ చేసి, తమవద్ద రెండు ఎకరాలు ఉంచుకున్నారని తెలిపారు. ఇద్దరు కుమారులు తమను సరిగా చూడడం లేదని కలెక్టరేట్‌లో ఈ నెల 24వ తేదీన జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆస్తులు తీసుకొని, తమ యోగ క్షేమాలు పట్టించుకోని కుమారులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వృద్ధ దంపతులు ఆర్డీవోను కోరారు. తాము వారికి రిజిస్టర్ చేసిన 12ఎకరాల భూమిని రద్దు చేసి తమకు ఇవ్వాలని కోరారు. ఇరువురి వాదనలు విన్న ఆర్డీవో శనివారం తమ కార్యాలయానికి వచ్చి తమ వాదనలు వినిపించాలని కుమారులను ఆదేశించారు.



వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కలాయిగూడెం పాఠశాలలో చెట్ల నరికివేత

• ఫిర్యాదు చేసిన పర్యావరణ ప్రేమికుడు • విచారణకు ఆదేశించిన డీఈవో • జరిమానా విధించిన అటవీశాఖ అధికారులు

నల్లగొండ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని గంధవారిగూడెంలో ఉన్న అక్కలాయిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో అనుమతులు లేకుండా దాదాపు 35సంవత్సరాల కింద నాటిన వేపచెట్లను నరికివేశారు. పాఠశాల కమిటీ తీర్మానం మేరకు చెట్లను విక్రయించామంటూ ప్రస్తుతం తమ వాదన వినిపించడం అనుమానానికి తావిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా, పర్యావరణ, అటవీ, రెవెన్యూ చట్టాల నిబంధనలు పాటించకుండా పాఠశాల ఉపాధ్యాయులు వేప చెట్లను విక్రయించారు. పాఠశాలలో ఆ చెట్లను విక్రయించాల్సిన అవసరం లేకున్నా, డబ్బుల కోసమే విక్రయించారా? లేక ఎక్కడైనా సొంత గృహ నిర్మాణాల కోసం వేపచెట్లను నరికించి కట్టెలు తరలించారా అనేది తేలాల్సి ఉంది. దాదాపు 10చెట్లకు పైగా విక్రయించారని తెలుస్తోంది. మరికొంత మంది ఆరు చెట్లను విక్రయించారని పేర్కొంటున్నారు. చెట్లను కొట్టివేసిన ఆనవాళ్లు తెలియకుండా వేర్లతో సహా ఎక్స్‌కవేటర్‌తో తీయించి అక్కడ మట్టితో చదును చేయించారు. అయితే ఈ విషయాన్ని గమనించిన స్థానికుడైన ఓ పర్యావరణ ప్రేమికుడు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు సీఎస్‌కు, ఫారెస్టు అధికారులకు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెండో శనివారంతో పాటు ఆదివారం రోజు చెట్లను నరికి విక్రయించినట్లు సమాచారం. వేప చెట్లను నరకడం, వాల్టా చట్టానికి విరుద్ధంతో పాటు 2002 సంవత్సరం ఆటవీ చట్టాల ప్రకారం అనుమతి లేకుండా వేప చెట్లను నరకడం, విక్రయించడాన్ని నిషేధించారు. వేప చెట్లను నరకాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. చట్టాలను ఉల్లంఘించి పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ విక్రయించడం, చెట్లను కొనుగోలు చేయ డం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే జిల్లా ఫారెస్ట్ అధికారి నాగభూషణం తన సిబ్బందితో కలిసి అక్కలాయిగూడెం ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. వేప చెట్లను కొనుగోలు చేసిన వారికి ఆటవీ శాఖ చట్టాల ప్రకారం రూ.30,300లను జరిమానా విధించి కేసు నమో దు చేశారు. పాఠశాలలో చెట్ల నరికివేత, విక్రయించిన వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి విచారణ అధికారిగా నార్కట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములును నియమించారు.



పాఠశాల ఉన్న మొద్దు

రోడ్డు ప్రమాదంలో మోటర్ మెకానిక్ మృతి

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ మోటార్ల మెకానిక్ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన గొర్ల నాగేశ్వరరావు(55) వ్యవసాయ మోటారు వైడింగ్ అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వస్తున్నాడు. మార్గం మధ్యలో అవంతీపురం వద్ద పేరెల్లి చందు తన ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొనడంతో నాగేశ్వరావు తీవ్రంగా గాయపడ్డాడు. నాగేశ్వరరావును చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు అభిరామ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

కోదాడ రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కొప్పోజు బ్రహ్మాచారి(55) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సిమెంట్ లోడు దించి రామాపురానికి వెళ్తుండగా, మార్గమధ్యలో కూచిపూడి గ్రామశివారు మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొంది. దీంతో బ్రహ్మాచారి తీవ్రంగా గాయపడడంతో ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

మత్స్యకారుల వలకు చిక్కిన కొండచిలువ

నార్కట్‌పల్లి, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల కోసం మత్స్యకారులు వేసిన వలలో కొండచిలువ చిక్కింది. దీంతో మత్స్యకారులు అటవీ అధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి కొండచిలువను స్వాధీన పర్చుకున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని తొండ్లాయి చెరువులో చేపల పట్టేందుకు గాను మత్స్యకారులు చెరువులో వల విసిరారు. నీటిలో నుంచి వలను లాగిచూడగా సుమారు ఏడు అడుగుల పొడవైన కొండ చిలువ వలకు చిక్కింది. దీంతో వెంటనే అటవీ అధికారులకు వారు సమాచారమిచ్చారు. దీంతో ఎఫ్ఎస్‌వో మల్లేశ్, ఎఫ్‌బీవో భవానిలు స్నేక్ క్యాచర్ దిగ్నేశ్‌తో కలిసి తొండ్లాయి చెర్వు వద్దకు వచ్చారు. వలలో చిక్కిన కొండచిలువను ఓ బస్తాలో వేసి దానిని ఇదే మండలంలోని చౌడంపల్లి పరిధిలో గల అటవీక్షేత్రం (ఫారెస్టు బ్లాక్)లో వదిలేశారు.

ఆటో బోల్తా.. తండ్రి, కుమారుడికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం జాతీయ రహదారిపై అదుపు తప్పి ఆటో పల్టీ కొట్టిన సంఘటనలో తండ్రి, కుమారుడికి గాయాలయ్యాయి. చిట్యాల మండలం నేరడ నుంచి సాయికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు ఆటోలో వెళ్తుండగా కొయ్యలగూడెం వద్ద డివైడర్‌ను ఆటో ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో తండ్రి సాయికుమార్, దేవన్ష్ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనసాగరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వేల్పుల నరేష్ నందిగామ సమీపంలో గల కాంచాలలో ఇసుక లోడ్ చేసుకుని హైద్రాబాద్‌కు తరలిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం పట్టుకుని లారీ డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చర్యలు తీసుకోవాలి

నల్లగొండ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులవద్ద తప్పుడు తుకాలతో కొనుగోలు చేసే ప్రైవేట్ వ్యాపారులు, దళారులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి అన్నారు. నల్లగొం డ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పత్తి పంటను భారీ పెట్టుబడులతో పండించిన రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకువెళ్ళినప్పుడు తేమ శాతం, నాణ్యత పేరుతో అధికారులు అనేక నిబంధనలు విధించడం రైతులకు శాపంగా మారిందన్నారు. సీసీఐ కేంద్రాల వద్ద రైతులు వారాల తరబడి నిరీక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీరెడ్డి సత్తిరెడ్డి, జిల్లా కోశాధికారి గజ్జి రవి, నర్సయ్య, బొమ్మిడి నగేష్ పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తితో..



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని 34వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దారి కొట్టుకుపోయింది. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతుండడంతో కాంగ్రెస్ నాయకుడు గందం పాండు స్పందించి తన సొంత ఖర్చులతో మట్టి తోలించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రహదారి చదును చేయించారు. అదేవిధంగా డ్రైనేజీ పూడిక కూడా తీయించారు. గతంలోనూ అదే ప్రాంతంలో కల్వర్టు నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, వేయించి ప్రజల ఇబ్బందులను తీర్చినట్లు గుర్తుచేశారు.

• ఆంధ్రజ్యోతి, కోదాడ,

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి



పత్తిమిల్లులో విచారణ నిర్వహిస్తున్న పోలీసులు జలాలు(ఫైల్)

మునుగోడు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తిమిల్లులో పనిచేసే కూలీ మృతి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఆ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కొంపెల్లి వేంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ జై బిందు కాటన్‌మిల్లు మంగళవారం జరిగింది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ పరిధిలోని సిలోని గ్రామానికి చెందిన ముస్తఫా జాఫర్ సాప్ జలాలు(30) పత్తి మిల్లులో పనిచేసేందుకు 15 రోజుల క్రితం వచ్చాడు. సోమవారం పనికి రాకుండా తోటి కార్మికుడు శార్దుల్‌తో కలిసి మండలకేంద్రంలో మద్యం సేవించి వచ్చిన ముస్తఫా జాఫర్ సాప్ జలాలు మిల్లులో మరో కార్మికుడితో గొడవ పడిన తర్వాత రూములో నిద్రించకుండా మిల్లులో నిల్వ చేసి ఉన్న పత్తిలో శార్దుల్‌తో కలిసి నిద్రించాడు. మిల్లులో జేసీబీ ఆపరేటర్ పత్తిని కుప్పకుట్టే సమయంలో పత్తిపై నిద్రిస్తున్న శార్దుల్ నిద్ర లేచాడు. కానీ ముస్తఫా జాఫర్ సాప్ జలాలును గమనించలేదు. జలాలు సోమవారం ఉదయం పనిలోకి రాకపోవడంతో తోటి కార్మికులు వెతికారు. అతని జాడ దొరకలేదు. ఇక్కడే ఉండొచ్చని జేసీబీతో పత్తి ఎత్తుతుండగా జలాలు మృతదేహం కన్పించింది. విషయం తెలుసుకున్న చండూరు సీఐ ఆదిరెడ్డి, మునుగోడు తహసీల్దార్ నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానం ఉన్న శార్దుల్, సుర శ్రీశైలంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచనామా చేసేందుకు మృతదేహాన్ని తీస్తుండగా జలాలు సోదరి రిజ్వాన అడ్డుకుంది. తమ తల్లి దండ్రులు వచ్చేంతవరకు మృతదేహాన్ని ముట్టుకుంటే తాము కూడా ఇక్కడే చచ్చిపోతామని చెప్పింది. న్యాయం చేస్తామని అధికారులు మృతుడి కుటుంబానికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా మృతదేహాన్ని తీయనివ్వలేదు.



పొంచిఉన్న ప్రమాదం..



నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం స్టేజీ సమీపంలో జిర్రిగూడెం, వెళ్లే దారిలో ఎండిన చెట్లు ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. గాలి, దుమారం వస్తే కూలిపోయే స్థితిలో ఉంది. జూనుతల నుంచి మైలాపురం, పాల్వాయి గ్రామాలకు వెళ్లే రహదారుల వెంట సుమారు 15చెట్ల వరకు ఎండి కూలిపోయే దశలో ఉన్నాయి. భారీ చెట్టు కూలితే రాకపోకలకు అంతరాయంతోపాటు ప్రమాదం జరిగే ఆస్కారముంది. ఆ చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

• ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు

వందేభారత్‌కు అదనపు బోగీలు

● నేటి నుంచి అమర్చనున్న రైల్వే శాఖ



మిర్యాలగూడ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతికి వెళ్లే భక్తు లకు రైల్వేశాఖ ప్రయాణికులకు శుభ వార్త చెప్పింది. సికింద్రాబాద్ నుంచి నల్లగొండ, మిర్యాలగూడ స్టేషన్ల మీదుగా తిరుపతికి వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబర్ (20701/ 20702)కు అదనపు బోగీలు అమర్చనుంది. ఇప్పటి వరకు 16 బోగీల(ఏసీ చైర్ కార్-14, ఎగ్జిక్యూటివ్ క్లాస్- 2)లో ప్రయాణికులను తరలిస్తున్న వందే భారత్ ట్రైన్ మరో 4 అదనపు బోగీలతో పరుగు లెట్టనుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ సూపర్ ఫాస్ట్ రైలులో అదనపు బోగీలను శాశ్వత ప్రాతి పదికన ఏర్పాటు చేయడంపై ఉమ్మడి జిల్లా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమయ పాలన, స్టేజీల్లో ఎలాంటి మార్పు లేదని, బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చే అదనపు బోగీల సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

సబ్ మార్కెట్ యార్డు ప్రారంభమెప్పుడో?

» రూ.1.70 కోట్లతో మాండ్రలో ఏర్పాటు

» సబ్ మార్కెట్ కార్యాలయం, షెడ్డు నిర్మాణం పూర్తి

» యార్డు ప్రారంభానికి అదనపు గోదాం మంజూరుతో ముడి?



మాండ్రలో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు కార్యాలయం

నార్కట్‌పల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల సౌకర్యార్థం నార్కట్‌పల్లి మండలం మాండ్రలో నూతనంగా నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు ప్రారంభానికి నోచుకోవడం లేదు. రైతులు తాము పండించిన పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం లేదా నిల్వ చేసుకోవడం కోసం వీలుగా చేపట్టిన సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం దాదాపు పూర్తయినా ఎందుకో పాలకులు యార్డు ప్రారంభంపై దృష్టి పెట్టడం లేదు. ఆర్నెళ్ల క్రితం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం పదవీ ప్రమాణ స్వీకారం సమయంలోనే ఈ సబ్‌మార్కెట్ యార్డును కూడా ప్రారంభిస్తారని భావించినా చేయలేదు. ప్రతిపాదనలో ఉన్న అదనపు గోడౌన్ మంజూరుతో ముడిపెట్టి సబ్ మార్కెట్ యార్డు ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నారని తెలిసింది. దీంతో ప్రస్తుతం ఈ యార్డును ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంగా రైతులు వినియోగించుకుంటున్నారు.

రూ.1.70 కోట్ల మార్కెట్ నిధులతో నిర్మాణం

నార్కట్‌పల్లి మండలం ప్రస్తుతం చిట్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలో కొనసాగుతుంది. చిట్యాల మండలానికి చెందిన 8 గ్రామాలు చౌటుప్పల్ మార్కెట్ కమిటీలో ఉండగా నార్కట్‌పల్లి మండలానికి చెందిన అన్ని గ్రామాలు చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలోనే ఉన్నాయి. నార్కట్‌పల్లిలో వ్యవసాయ ఉప మార్కెట్ కమిటీ (అద్దె) కార్యాలయం కూడా ఉంది. అయితే నార్కట్‌పల్లి మండలంలో సబ్ మార్కెట్ యార్డు నిర్మించాలని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆ ప్రయత్నాల కొనసాగింపుగానే దాదాపు 15 సంవత్సరాల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎట్టకేలకు సబ్ మార్కెట్ యార్డు మంజూరైంది. మండలంలోని మాండ్ర గ్రామంలో దీనిని ఏర్పాటు చేశారు. సుమారు రూ.1.70కోట్ల అంచనాతో చేపట్టిన మార్కెట్ యార్డుకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. కానీ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో రైతుల తమ పంట ఉత్పత్తుల విక్రయానికి బహిరంగ మార్కెట్ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు.

గోదాము కోసమే ఆలస్యం?

సుమారు 4.11 ఎకరాల విస్తీర్ణంలో సబ్ మార్కెట్ యార్డు కార్యాలయం, 100/40 విస్తీర్ణంలో ఉండే కవర్ షెడ్డు, ప్రహరీ, రైతుల కోసం టాయ్‌లెట్ బ్లాక్‌ను నిర్మించారు. అంతర్గత రోడ్లను వేయాల్సి ఉంది. అయితే ఈ సబ్‌మార్కెట్ యార్డులో గోడౌన్ మంజూరు చేయించి ప్రారంభించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సంకల్పించినట్లు తెలిసింది. సుమారు 2500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోడౌన్ నిర్మాణం కోసం నాబార్డుకు ప్రతిపాదనలు పంపారు. మంజూరు కాగానే అటు సబ్‌మార్కెట్ యార్డుకు ప్రారంభం ఇటు గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన ఇలా ఏకకాలంలో చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



మాండ్రలో సబ్ మార్కెట్ యార్డును చిట్యాల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు ప్రారంభిస్తారని అనుకు న్నాం. కానీ కొన్ని కారణాలతో వాయిదా పడింది. సబ్ మార్కెట్ యార్డు ప్రారంభోత్సవ విషయాన్ని మరోసారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా. త్వరలో అది ప్రారంభించి రైతులకు అందుబాటులో వచ్చేలా పాలకవర్గం తరపున కృషి చేస్తా.

- నర్రా వినోదమోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్, చిట్యాల మార్కెట్ కమిటీ

సబ్ మార్కెట్ యార్డును ప్రారంభించాలి



మాండ్రలో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డును వెంటనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. అదేవిధంగా మరికొన్ని నిధులను మంజూరు చేసి అదనపు షెడ్డులతో రైతులకు సౌకర్యంగా మార్చాలి. చిట్యాల వ్యవసాయ మార్కెట్ నుంచి వేరుచేసి నార్కట్‌పల్లి సబ్ మార్కెట్‌ను మార్కెట్‌గా ప్రభుత్వం గుర్తించాలి. ఆ దిశగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

-నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, నార్కట్‌పల్లి

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	582.60 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	4,160 క్యూసెక్కులు
కుడికాల్వకు	9,500క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	12,586 క్యూసెక్కులు
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ	నిల్
అవుట్‌ఫ్లో	28,046 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.0123 టీఎంసీలు
నీటి రాక	3,000 క్యూసెక్కులు
నీటి విడుదల	2,000 క్యూసెక్కులు

- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.20 అడుగులు
నీటి రాక	722.10 క్యూసెక్కులు
నీటి విడుదల	1031.04 క్యూసెక్కులు

- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

-శాలిగౌరారం

అయ్యప్ప మాలధారుడి ఆత్మహత్య

● కారు కిస్తీ చెల్లించాలని ఫైనాన్సర్ బెదిరింపులు

● భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం

● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో విషాదం



నవీన్‌కుమార్ (ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో ఇరుముడి ధరించి శబరిమల వెళ్లాల్సిన భర్త ఆత్మహత్య చేసుకోగా, భార్య ఆత్మహత్యాయత్నం చేసింది. కారు కొనుగోలుకు తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో ఫైనాన్సర్ బెదిరింపులే ఇందుకు కారణమని భార్య ఆరోపి ంచింది. మృతుడి భార్య త్రిష, ఎస్ఐ బండి మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మఠంపల్లి మండలం బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన పిల్లుట్ల ఆంజనేయులు, కృష్ణవేణి దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ (24)హుజూర్‌నగర్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన నర్సింహారావు కుమార్తె త్రిషను నాలుగు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. దంపతులు హుజూర్‌నగర్‌లోని సాయిబాబా కాలనీలో ఓ అద్దె ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. భర్త ప్రైవేట్ ఫైనాన్స్‌లో సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేయగా, వారికి రూ.4లక్షలు చెల్లించాల్సి ఉంది. చెల్లింపు ఆలస్యం కావడంతో కారును తీసుకువెళతానని ఫైనాన్సర్ బెదిరించాడని నవీన్‌కుమార్ తన భార్య వద్ద మనోవేదనకు గురయ్యాడు. అయ్యప్పమాల ధరించిన నవీన్‌కుమార్ డిసెంబరు 1వ తేదీన శబరిమలకు వెళ్లాల్సి ఉంది. మంగళవారం భార్య త్రిష బయటకు వెళ్లిన సమయంలో తలుపునకు గడియ పెట్టుకుని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చే సరికి తలుపు గడియ పెట్టి ఉండటంతో ఇంటి యజమాని సహ కారంతో తలుపులను ధ్వంసం చేసి చూడగా, అప్పటికే నవీన్‌కుమార్ మృతిచెందాడు. అయ్యప్ప మాలధారణలోనే నవీన్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడం విషాదం నిం పింది. భర్త మృతి చెందడంతో మనోవేదనకు గురైన త్రిష ఇంట్లో ఉన్న బ్లేడ్‌తో గొంతు కోసుకుంది. దీంతో ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని నవీన్ కుమార్ తండ్రి ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నవీన్‌కుమార్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మధు

త్రిపురారం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన జెర్రిపోతుల మధు ఎంపికయ్యారు. 2026 జనవరిలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా మధును నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మండల కేంద్రంలో మంగళవారం శాలువాతో సన్మానించారు ఇటీవల నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ జూనియర్ విభాగం పోటీల్లో గోల్డ్ మెడల్, సీనియర్ విభాగంలో సిల్వర్ సాధించాడు. 79 కిలోల విభాగంలో స్నాచ్, 11 5 కిలోల విభాగంతో క్లీన్ అండ్ జెరాక్, 135 కిలోల టోటల్ 250 కిలోల బరువు ఎత్తి ప్రతిభను కనబరిచారు. మధు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లలో శిక్షణ పొందుతున్నాడు. జాతీయస్థాయిలో మధు ప్రతిభ కనబర్చడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్ల చంద్రారెడ్డి, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



మధును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

లాక్రోస్ రాష్ట్ర జట్టుకు పరమేష్ ఎంపిక



ట్రోఫీ గెలుచుకున్న సూర్యాపేట జిల్లా జట్టు

నేరేడుచర్ల, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్‌లో నిర్వహించే లాక్రోస్ ఆటకు రాష్ట్ర జట్టుకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన మచ్చ పరమేష్ ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువులోని మైత్రి గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు మొదటి స్థానం దక్కించుకోగా, సూర్యాపేట జిల్లా జట్టు రెండో స్థానం కైవసం చేసుకుంది. సూర్యాపేట జిల్లా జట్టు కెప్టెన్ పరమేష్ తెలంగాణ జట్టులోకి ఎంపికైనట్లు తెలంగాణ లాక్రోస్ కోచ్ భానుచందర్ ప్రకటించాడు. ఈ సం దర్భంగా పరమేష్ స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా జట్టు నుంచి తాను రాష్ట్ర జట్టులో అవకాశం ఆనందంగా ఉన్నది. డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. పరమేష్ జట్టుకు ఎంపిక కావడంపై తోటి జట్టు సభ్యులు, తల్లిదండ్రులు రాంబాబు, స్వరాజ్యం, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

● డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య

● ముగిసిన ఖోఖో క్రీడల పోటీలు

● బాల బాలికల్లో ఆదిలాబాద్ ప్రథమ స్థానం



ప్రథమ స్థానం సాధించిన ఆదిలాబాద్ జట్టు

బాలికల విజేతలు

ప్రథమ స్థానం: అదిలాబాద్
ద్వితీయస్థానం:మహబూబ్‌నగర్
తృతీయ స్థానం: నల్లగొండ.

బాలుర విజేతలు

ప్రథమ స్థానం: ఆదిలాబాద్
ద్వితీయ స్థానం: రంగారెడ్డి
తృతీయ స్థానం: నల్లగొండ

చౌటుప్పల్ రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య అన్నా రు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్-17 ఖోఖో పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ క్రీడల్లో రాణి స్తే స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చునని అన్నారు. విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడలను కాపాడుకోవాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో మొదటి సారిగా పంతంగిలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్టులను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నగోని కృష్ణమూర్తి, ఎంఈవో గురువరావు, నాయకులు బాతరాజు సత్యం, బోయ వెంకట్, కాకి సుందరయ్య, బోయ అంబేద్కర్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, బోయ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సురేందర్

చింతలపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14,17 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల కు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్లను సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపికకు ఉమ్మడి నల్లగొండ జిల్లాల నుంచి వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చింతలపాలెం తహసీల్దార్ సురేందర్‌రెడ్డి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపికైన బాల బాలికల జట్లు డిసెంబరులో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. కార్యక్రమంలో ఎంఈవో నారపరాజు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వేములూరి రంగాచారి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అయితగోని శ్రీనివాస్, వీరన్న, చిర్ర మల్లేష్, దాసరి పృథ్వీరాజ్, వీరేశం, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉస్మాన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.


క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.36,56,631 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు



కల్యాణతంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామి వారికి మంగళవారం విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయంలో ప్రాత:కాలార్చనలు పూర్తయ్యాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకి ంచారు. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవుడికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు,యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమం చేపట్టారు. అలాగే క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం 9:30 గంటలకు లక్ష్మీనృసింహుని పరిణయోత్సవ క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఈవో అజ్మీరా జ్యోతి, ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయ హక్కుకు రేపు బహిరంగ వేలం

మట్టపల్లిలో కొబ్బరికాయ విక్రయ హకు కోసం ఈనెల 27వ తేదీన క్షేత్రంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అజ్మీర జ్యోతి మగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు స్వామివారి పేరున రూ.3 లక్షలు డిపాజిట్ చేసి పాల్గొనాలని, పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయానికి సంప్రదించగలరని కోరారు. ఈ వేలం పాట 18 జనవరి 2026 నుంచి 17 జనవరి 2027 వరకు కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

వస్తు విక్రయ హక్కులకు టెండర్ వేలం

● ఎల్లమ్మ ఆలయానికి పెరిగిన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కనగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఏడాది కాలానికి వస్తు విక్రయహక్కులను కల్పించుటకు మంగళవారం అధికారులు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. లడ్డు, పులిహోర విక్రయాలకు దామరచర్లకు చెందిన డి.స్నేహా రూ.14,14,141లకు వేలం పాడి హక్కులను పొందాడు. గతేడాదితో పోల్చితే ప్రస్తుత వేలంలో ఆలయానికి రూ.2.29లక్షల ఆదాయం పెరిగింది. అదేవిధంగా గాజుల అమ్మకం నల్లగొండ పట్టణానికి చెందిన పి.రవికుమార్ రూ.9.65లక్షలకు వేలం పాడి హక్కులను పొందాడు. గతేడాది కంటే 45 వేల ఎక్కువ ఆదాయం సమకూరింది. దేవస్థానం ఫంక్షన్‌హాల్ నిర్వహణకు దర్వేశిపురం గ్రామానికి చెందిన సత్తయ్య రూ.1 లక్షకు వేలం పాడి హక్కులను పొందాడు. బొమ్మలు, కిరాణం, ఫొటోలు తీయడానికి సరైన వేలం రాలేదు. దీంతో వాటి వేలాన్ని అధికారులు వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలన అధికారి ఏడుకొండలు, ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్య, గాలి నాగేశ్వర్‌రావు సి బ్బంది నాగరాజు, శ్రీకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నవీన్‌కుమార్

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మంగళవారం ఎన్ఐఆర్‌డీ పీఆర్ శిక్షణలో భాగంగా ఛత్తీస్‌ఘడ్ బృందం సందర్శించింది. స్థానిక ఎంపీడీవో నవీన్‌కుమార్ ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పనులను బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవో చంద్రశేఖర్, ఏపీవో నర్సయ్య, సాంకేతిక సహాయకులు వెంకటనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లకు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలి



దర్నాలో పాల్గొన్న నాయకులు

నల్లగొండరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీంలను విషయంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సం ఘం రాష్ట్ర కార్యదర్శి (సీఐటీయూ) చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ డీసీఎల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మృతి, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం లాంటి పథకాలను జీవో నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ రూ.346.36 కోట్ల క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణరంగ కార్మికులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 13 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బొంగరాల నరసింహ, జిన గేష్, కేఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట
కోదాడ-హుజూర్‌నగర్-తుంగతుర్తి

రైతు సంక్షేమమే ధ్యేయం

పెన్‌పహాడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, ధర్మాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, తహసీల్దార్ లాలునాయక్, ఏపీఎం అంజయ్య, అడ్డి కేశవులు, సీసీలు పద్మ, వెంకన్న పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

కోదాడ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హనుమకొండలో ఈ నెల 23వ తేదీన జరిగిన 11వ తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ జూనియర్స్ విభాగంలో కోదాడ కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ అదస రాణి తెలిపారు. బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కాకాని విజయ(తృతీయ), బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని వాంకుడోత్ గౌరి(ద్వితీయ) బహుమతి సాధించారు. ఈ విద్యార్థినులను మంగళవారం కళాశాలలో అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీ పి.ఫ్రాన్సిస్, రఫీ, ఎ.రాజులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించిన బాలోత్సవ్-2025 పోటీలో విజేతలైన కోదాడలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ గ్రామాల్లోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, వడమాల, పులిహోరను స్వామికి నివేదించారు. ఈ కార్యక్రమాల్లో ఈవో చలపతి, లక్ష్మణ్‌రావు, అళహరి నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమార్, హరీష్‌కుమార్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సమాయత్తం చేసినట్లు ఎంపీఈవో లావణ్య, ఎస్‌ఐ బండి మోహన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అమరవరం, లక్కవరం, బూరుగడ్డ, సింగారంతో పాటు 11 గ్రామపంచాయతీ పరిధిలోని 110 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 27 లొకేషన్లు పరిశీలించామన్నారు. స్థానిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, కార్యదర్శులు గిరిజ, శ్రీకాంత్, మౌలానా, ప్రవీణ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

అర్వపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని పర్సాయపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని త్వరితగతిన ఆరబెట్టి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

'హిడ్మాది హత్యే'

తుంగతుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హిడ్మాను హత్య చేసి ఎన్‌కౌంటర్ అని ప్రకటించడం సరికాదని సీపీయూఎస్‌ఐ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఉండగా పోలీసులు పట్టుకెళ్లి హత్య చేసి, ఎన్‌కౌంటర్ అన్ని చెబుతున్నారని ఆరోపించారు.

దళితుల భూముల్లో డ్రైనేజీ నిర్మాణం సరికాదు

కోదాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోదాడలోని అనంతగిరి రోడ్డు చెరువు సమీపంలో మునిసిపాలిటీ అధికారులు దళితుల భూముల్లో డ్రైనేజీ కాల్వలను నిర్మించడంతో ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు చింతాబాబు మునిసిపల్ అధికారులను కోరారు. మంగళవారం కోదాడలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.. వినతిపత్రం ఇచ్చిన వారిలో వారి వెంట ఈశ్వర్, ముస్లిం, మైనార్టీ నాయకులు, అన్ను, చింత సహదేవ, రాంబాబు, చంద్రశేఖర్ ఉన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూర్(ఎస్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుడులు సాధించాలని కేవీకే (గడ్డిపల్లి) వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో సాగు చేసిన కంది పైర్లను హైదరాబాద్‌కు చెందిన లయోల కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రవళిక, వర్షిణి, బేనిలా జోషి, యామిని, శ్రీలత, ప్రిన్సీ, లీలావతి, వైష్ణవి, తేజశ్విని పాల్గొన్నారు.

అందరికీ చీరలు అందజేయాలి: బీఆర్‌ఎస్

తుంగతుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లో లేని మహిళలకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చీరలు అందజేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తుంగతుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండి తెల్లరేషన్ కార్డులో పేరున్న ప్రతి మహిళకు బతుకమ్మ పేరున్న ప్రతి మహిళకు బతుకమ్మ చీరె అందజేసిందన్నారు. ఇదే విధానాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, సబ్సిడీ గ్యాస్, ఉచిత కరెంట్, సన్న ధాన్యానికి బోనస్ కూడా అరకొరగానే అమలయ్యాయని అన్నారు.

అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో బీసీలు పోటీ?

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా బీసీలను పోటీకి దించేందుకు నాయకులు దృష్టి సారించారు. హుజూర్‌నగర్ మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో ఆరు అన్‌రిజర్వ్‌డ్ కాగా, బీసీలకు రెండు, ఎస్సీలకు మూడు స్థానాలు రిజర్వ్ అయ్యాయి. కాగా ప్రధాన పార్టీల నుంచి జనరల్ స్థానాలుగా ఉన్న శ్రీనివాసపురం, లక్కవరం గ్రామాల్లో బీసీలు పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వేపలసింగారం, బూరుగడ్డ, అమరవరం, అంజలిపురం, శ్రీనివాసపురం స్థానాలు జనరల్‌కు కేటాయించిన నేపథ్యంలో ఇక్కడ పోటీ తీవ్ర రూపం దాల్చింది. కాగా శ్రీనివాసాపురం, అమరవరం, సింగారం గ్రామాల్లో నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మండలంలోని ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో కూడా పోటీ నెలకొంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు.

పాఠశాలకు బీరువా, వాటర్ ప్లాంట్ బహూకరణ

నేరేడుచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు 2005-06బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ం రూ. 20వేలు విలువైన ఇనుప బీరువాలు అందజేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన రిటైర్డు సీఐ సిరికొండ కృష్ణ తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, తిరుపతయ్యల జ్ఞాపకార్థం రూ.10వేలు విలువైన వాటర్ ప్లాంటును సమకూర్చారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం ఎల్.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లెపంగ నాగరాజు, గౌస్, రాజశేఖర్, కృష్ణ, సంధ్య, స్వాతి, రాఘవరెడ్డి, గోపయ్య, శ్యాంసుందర్‌రావు, అనిల్‌కుమార్, సైదులు, లింగయ్య, శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీ సభ్యులకు సన్మానం

నేరేడుచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కమిటీలో నియమితులైన నేరేడుచర్లకు చెందిన కోశాధికారి తాళ్ల నరేందర్‌రెడ్డి, ఐటీ సెల్ జిల్లా ఇన్‌చార్జి చిలకరాజు కరుణాకర్‌లను మంగళవారం సన్మానించారు. ఈ ఈ కార్యక్రమంలో కొణతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, కాలం నాగయ్య పాల్గొన్నారు.

ఉన్నా.. లేనట్లే

- అలంకారప్రాయంగా జిల్లా పరిషత్ అతిథి గృహం
- నిర్వహణ కొరవడినందున శిథిలావస్థకు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా భవనం



గేటు ఊడి నిరుపయోగంగా ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహం

మఠంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేరుకే జిల్లా పరిషత్ అతిథి గృహం. నిర్వహణను ఎవరూ పట్టించుకోనందున నిరుపయోగంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మఠంపల్లి మండలంలో ప్రసిద్ధ మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహుని క్షేత్రం ఉన్నందున దేవుడి దర్శనానికి వచ్చే అతిథులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల కోసం ఇక్కడ అతిథి గృహాన్ని రెండు దశాబ్దాల క్రితం సకల సౌకర్యాలతో నిర్మించారు. దీని పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించారు. క్రమేణ దీనిపై శ్రద్ధ కొరవడినందున అలంకారప్రాయంగా మారింది. అతిథి గృహం ఆవరణలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు మొలిసి అధ్వానంగా మారి శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం మందు బాబులకు అడ్డాగా మారింది. మండలంలో పలు పరిశ్రమలతో పాటు మట్టపల్లిలో ప్రసిద్ధ లక్ష్మీనృసింహుని క్షేత్రం ఉంది. మట్టపల్లి రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పాటు, ఈ ప్రాంతంలో వంతెన అందుబాటులోని రావడంతో ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల భక్తుల రద్దీ పెరిగింది. విశిష్ట రోజుల్లో రద్దీకి తగిన విధంగా వసతి గృహాలు లేనందున దైవ దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. కుల సంఘాలకు చెందిన సత్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ అతిథి గృహం స్థానంలో కొత్తది నిర్మించాలని, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు. దీని నిర్వహణ బాధ్యతను స్థానిక పరిశ్రమకు /మట్టపల్లి దేవాలయానికి అప్పగించి వినియోగంలో తీసుకోరావాలని మండల ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

నిర్వహణ బాధ్యత పరిశ్రమ/ దేవస్థానానికి అప్పగించాలి



లక్షల రూపాయాలు ఖర్చుచేసి మట్టపల్లిలో అతిథి గృహాన్ని నిర్మించారు. కంప చెట్లు పెరగడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీని నిర్వహణ బాధ్యతను స్థానిక పరిశ్రమ/ మట్టపల్లి దేవస్థానానికి అప్పగించాలి. నిరుపయోగంగా అతిథి గృహనికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి, సౌకర్యాలు కల్పించి సిబ్బందిని నియమించాలి.

● రామిశెట్టి అప్పరావు, మట్టపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

జిల్లా పరిషత్ అతిథి గృహంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామ పంచాయతీ పరిధిలో పనులను చేపట్టేందుకు సహకరిస్తాం. మరిన్ని సౌకర్యాలు కోసం జిల్లా అధికారులకు నివేదించాం. ప్రసుత్తం భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు మంజూరు కాగానే, త్వరతగతిన పనులు చేపట్టి, సిబ్బందిని కూడా నియమించేవిధంగా చర్యలు తీసుకుంటాం.

● చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, మట్టపల్లి

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా సైదులు

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన సైదులుగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెరువు వెంకన్న గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

హుజూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుంటిపల్లి శ్రీనివాస్, డాక్టర్ రామారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కళాశాలలో విద్యార్థులకు హార్ట్‌ఫుల్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానంతో మనోవికాసం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, నర్సింహారావు, రాజు, మీరా, ఉపేందర్ పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి రాష్ట్ర ప్రభుత్వం



తిరుమలగిరిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్, మద్దిరాల, నాగారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల పక్షపాతని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మంగళవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను అందచేసి మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని 1724 మహిళా సంఘాలకు రూ.1.25కోట్ల విలువైన చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. వివిధ మండలాల్లోని గ్రామాల మహిళా సంఘాల అకౌంట్లలో వడ్డీ లేని రుణాలు జమైనట్లు తెలిపారు. ఈ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్వపల్లి, నాగారం, తిరులమగిరి మండలాలకు మూడు ఆర్టీసీ బస్సులు మంజూరయ్యాయని, వాటిని మహిళా సంఘాలకు అప్పగిస్తామ న్నారు. మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందించడానికి పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టే పనిని అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్, జడ్పీ సీఈవో అప్పారావు, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ సైదులు, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పాల్గొన్నారు.

● తిరుమలగిరి రూరల్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం మండలంలోని చౌళ్లతండా నుంచి రూప్లాతండ మీదుగా బండరామారం వరకు, సిద్దిసముద్రంతండా నుంచి మొండిచింత తండా వరకు రూ.7.35 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మీలాల్, నాయకులు జనార్దన్, రామోజీ, సోమయ్య, కుర్ర శ్రీను, వీరేష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేస్తా

తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామంలో రూ.3.50కోట్లతో రహదారి పనులు, రూ.12లక్షలతో కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి, రూ.5లక్షలతో పోలుమళ్ల గ్రామ స్టేజీ వద్ద బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెడ్డిగూడెం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తోందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయేషాపర్వీనా, డీఎంహెచ్‌వో వెంకటరమణ, అధికారులు లింగానాయక్, కల్యాణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

కాంగ్రెను ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందనిఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం పస్తాల గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1 కోటితో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. హ్యామ్ పథకం కింద మండలంలో పేరబోయినగూడెం, గుండెపురి నుంచి పస్తాల వరకు బీటీ రోడ్డుకు రూ.10కోట్లు మంజూరైనట్లు తెలిపారు.. త్వరలోనే టెండర్ ప్రకియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, బండగోర్ల నరేష్, బుక్క శ్రీను, వడ్లకొండ వెంకన్న, వేణు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



గుడిబండ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని గుడిబండ గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన పరపతి సంఘం గోదాంను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేసి రూ.500 బోనస్ అందిస్తున్నామన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సర్వే నిర్వహించిందన్నారు. గుడిబండ గ్రామాన్ని ఇందిరమ్మ పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 300ఇళ్ల మంజూరు చేశామని, ఇప్పటికే సగానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన పేదలను గుర్తించి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిని గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, గుడిబండ సింగిల్ విండో చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ బుడిగ నరేష్, సింగిల్ విండో చైర్మన్లు కొత్త రఘుపతి, నంబూరి సూర్యం, నలజాల శ్రీనివాసరావు, తూమాటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగులకు మంజూరైన 20 ట్రైసైకిళ్లను మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి మంగళవారం పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఎంపీడీవో హుస్సేన్, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మునిసిపల్ మాజీ చైర్మన్ సామినేని ప్రమీల రమేష్ తల్లి రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పద్మావతి మంగళవారం పరామర్శించారు.

మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం



కోదాడలో మహిళలకు చెక్కు అందజేస్తున్న వంగవీటి రామారావు

కోదాడ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతగిరి మండలంలో 496 స్వయం సహాయక సంఘాలకు రూ.41.96 లక్షలు; చిలుకూరు మండలంలో 432 స్వయం సహాయక సంఘాలకు రూ.31.80 లక్షలు; కోదాడ మండలంలో 547 స్వయం సహాయక సంఘాలకు రూ.51.68 లక్షలు; మోతె మండలంలో 293 స్వయం సంఘాలకు రూ.17.89 లక్షలు; నడిగూడెం మండలంలో 391 స్వయం సహాయక సంఘాలకు రూ.35.53 లక్షలు. మొత్తం కోదాడ నియోజకవర్గంలో 2713 స్వయం సహాయక సంఘాలకు రూ.2.10 కోట్లను వడ్డీ లేని రుణాల కింద మంజూరు చేసిందని తెలిపి, ఈ రుణాల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఇజాక్ హుస్సేన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, సరిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

హుజూర్‌నగర్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆర్డీవో శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రాధికఅరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్వయం సహాయక సంఘాలకు చెక్కులు, చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా 2,888 స్వయంసహాయక సంఘాలకు రూ.2.12 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో అప్పారావు, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో సుమంత్, ఏపీఎం అరుణ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీను, దొంగరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వీరారెడ్డి, స్వరూప, గోపిరెడ్డి, ఈడ్పుగంటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరెలు పంపిణీ

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్: హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో మహిళలకు ఇందిరమ్మ చీరెలను కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, రెక్కల ఆదినారాయణరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు.

● కోదాడ మండలం అడ్లూరు గ్రామంలో ఇందిరమ్మ చీరలను కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల అధ్యక్షుఉడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అవినాష్ పాల్గొన్నారు.

● చింతలపాలెం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు ఏపీఎం శేషయ్య చీరలు అందజేశారు.

● మఠంపల్లిలోని పంచాయతీ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆధూరి కిషోర్‌రెడ్డి పంపిణీ చేశారు.

●తంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో చీరలను కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ పంపిణీ చేశారు.

● గరిడేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో చీరలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి పంపిణీ చేశారు.

అపార్‌పై సాగదీత?

(5వ పేజీ తరువాయి)

అపార్ వివరాలతో పోలితే ఐడీ కార్డు మంజూరవుతుంది. ఇది కేవలం 10 ఏళ్ల లోపు విద్యార్థుల ప్రక్రియ కాగా మిగిలిన వారి వివరాలు అపార్ ద్వారా నేరుగా చేస్తారు.

నమోదుపై దృష్టి సారించని విద్యాసంస్థలు

తల్లిదండ్రులు తమ పిల్లల పూర్తి వివరాలను ఉపాధ్యాయులకు నిర్ణీత సమయంలో అందించడంలేదు. యూడైస్‌లోని వివరాలు ఆధార్‌లోని సమాచారం చాలా వరకు వ్యత్యాసం ఉంటోంది. ఆధార్‌లోని తప్పులను సరిచేయకుండా తల్లిదండ్రులు ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లు పాఠశాలల రికార్డులో ఒకలా బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డులో మరోలా ఉంటున్నాయి.

ఉపయోగం ఇలా

జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్డును కేంద్రం జారీ చేస్తోంది. దీంతో విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో భద్రపర్చుకోవచ్చు. పోటీ పరీక్షల సమయంలో, ఉద్యోగ అవకాశాల్లో ప్రవేశాల్లో అపార్ ఉపయోగపడనుంది. అదేవిధంగా పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమాచారంతో పాటు డ్రాపౌట్ వివరాలు తెలుస్తాయి.

త్వరగా పూర్తి చేసేలా చర్యలు

అపార్ ప్రక్రియ వేగంగా పూర్తిచేసేలా సూచనలు చేశాం. డిసెంబరు నాటికి పూర్తవుతుంది. అపార్‌తో ఉపయోగాలు ఉన్నాయి. విద్యార్థుల వివరాలు ఎక్కడా తప్పులు జరుగకుండా పకడ్బందీగా నమోదు ప్రక్రియ చేస్తున్నాం.

● శ్రవణ్‌కుమార్, సెక్టోరియల్ అధికారి

రైతుల ప్రయోజనాలే లక్ష్యం

నేరేడుచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మార్కెట్ యార్డులో ధాన్యం డ్రయ్యర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేరేడుచర్ల మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే డ్రయ్యర్ అందుబాటులో ఉందన్నారు. తేమ శాతం 17 వచ్చేందుకు అవసమైతే ఈ పరికరాన్ని రైతుల పొలాల వద్దకు తీసుకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చామన్నారు. ట్రయల్ రన్‌లో భాగంగా పులగంబండ తండాకు చెందిన రమావత్ కిరణ్ ధాన్యాన్ని ఆరబెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి టి.సన్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

మోగిన నగారా

(5వ పేజీ తరువాయి)

ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికలు బ్యాలెట్ ద్వారా జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మొత్తం 4,438 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా ఇప్పటికే 4,357 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. అదేవిధంగా 7,967 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది అవసరం కానున్నారు. అందులో 3,551 మంది పీవోలు, 4,406 మంది ఓపీవోలను ఇప్పటికే నియమించారు. వీరందరికి గతంలోనే శిక్షణ కూడా పూర్తిచేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తారు.

వార్డు రిజర్వేషన్లు

విభాగం	సంఖ్య	మహిళలు	జనరల్
ఎస్టీలకు	867	404	463
ఎస్సీలకు	786	323	463
బీసీలకు	770	311	459
జనరల్‌కు	1,965	900	1,065
మొత్తం	4,388	1,938	2,450

మొదటి విడతలో...

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆత్మకూర్(ఎస్)	30	274	44,053	21,800	22252	1
అర్వపల్లి	17	152	24,615	12,157	12,458	
మద్దిరాల	16	148	25,307	12,569	12,738	
నాగారం	14	132	24,775	12,227	12,545	3
నూతనకల్	17	166	29,066	14,503	14,563	
సూర్యాపేట	25	220	31,620	15,652	15,967	1
తిరుమలగిరి	16	132	17,799	8,925	8,874	
తుంగతుర్తి	24	218	34,616	17,308	17,308	

రెండో విడతలో...

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
అనంతగిరి	20	178	25,889	12,545	13343	1
చిలుకూరు	17	158	32,899	15,915	16,984	
చివ్వెంల	32	258	29,211	14,328	14,882	1
కోదాడ	16	158	31,881	15,462	16418	1
మోతె	29	262	37,823	18,731	19,087	5
మునగాల	22	210	36,394	17,695	18,699	
నడిగూడెం	16	148	24,571	12,089	12,481	1
పెన్‌పహాడ్	29	256	34,077	16,632	17,445	

మూడో విడతలో...

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
చింతలపాలెం	16	148	26,832	13,132	13,700	
గరిడేపల్లి	33	300	46,796	22,654	24,135 5	
హుజూర్‌నగర్	11	110	21,031	10287	10744	
మఠంపల్లి	29	152	37,663	18,314	19,349	
మేళ్లచెర్వు	16	152	34,287	16,740	17,546	1
నేరేడుచర్ల	19	168	22,142	10,720	11,422	
పాలకవీడు	22	186	21,468	10,358	11,110	